క్లుప్తంగా

వీధి దీపాలతో తిప్పలు



గుడ్లూరులో అంధకారంలో మిట్టపాలెం వెళ్లే రహదారి

గుడ్లూరు: మండల కేంద్రమైన గుడ్లూరులో పలు బజారుల్లో గత 5 రోజులు నుంచి వీధి దీపాలు వెలగకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మెయిన్ బజారు, బీసీ కాలనీకి వెళ్ళే దారి, గాంధీ బొమ్మ సెంటర్ నుంచి మిట్టపాలెం వెళ్ళే రహదారిలో వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రి 8 గంటలు దాటిన తరువాత ఈ బజారులు గాఢాంధకారంగా మారడంతో ఆ సమయంలో వివిధ పనులు నిమిత్తం రాకపోకలు కొనసాగిస్తున్న ప్రజలు చీకట్లో నడవాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కుక్కల బెడద కూడా ఎక్కువగా ఉందని చెబుతున్నారు. పంచాయతీ అధికారులు తక్షణమే చర్యలు తీసుకొని వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి స్వామి

సింగరాయకొండ: పురాణ ప్రసిద్ధిగాంచిన పాత సింగరాయకొండలోని వరాహలక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో ఈనెల 16 నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతున్నాయి. ఈ సందర్భంగా రాష్ట్ర సాంఘిక, సంక్షేమ శాఖా మంత్రి డీబీవీ స్వామిని ఆలయ ఈఓ పి.కృష్ణవేణి, ట్రస్టు బోర్డు చైర్మన్ పామర్తి మాధవరావు, ఆలయ ప్రధాన అర్చకులు ఉదయగిరి వెంకట శ్రీ లక్ష్మీనరసింహాచార్యులు విజయవాడలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బ్రహోత్మవాల వాల్‌పోస్టర్‌ను మంత్రి చేతులమీదుగా ఆవిష్కరించారు. టీడీపీ నాయకులు దామచర్ల పూర్ణచంద్రరావు, మించల బ్రహ్మయ్య, పాపయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు సద్వినియోగం చేసుకోండి



వేములపాడులో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

హనుమంతునిపాడు: ఇంటింటి ఫ్యామిలీ డాక్టర్ వైద్య పరీక్షలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ లక్ష్మి భార్గవి అన్నారు. శుక్రవారం ఇంటింటికీ ఫ్యామిలీ డాక్టర్ వైద్య క్యాంప్ వైద్య పరీక్షలు వేములపాడులో నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వ్యాధి పట్ల తీసుకోవల్సిన జాగ్రత్తలపై సలహాలు సూచలిచ్చారు. అనంతరం ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో 58 మందికి జలుబు, దగ్గు, జ్వరం, బీపీ, షుగర్ వ్యాధి గ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులకు, బాలింతలకు రక్త పూతలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట పైర్లతో భూమి సారవంతం



టంగుటూరులో రైతులతో మాట్లాడుతున్న వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు

టంగుటూరు: రైతులు తప్పనిసరిగా పచ్చిరొట్ట పైర్లు సాగు చేసి భూమి ఆరోగ్యం కాపాడుకోవాలని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్థానిక వేలం కేంద్రంలో రైతులకు శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. పచ్చిరొట్ట ఎరువులైన జనుము, సీమ జీలుగు, జీలుగు, అడవి నీలి, పిల్లి పెసర, నవధాన్యాలు, నూనె గింజలు, సుగంధ ద్రవ్యాలు, ఆకుకూరలు తదితర పంటల ఉపయోగాలు వివరించారు. పచ్చిరొట్ట విత్తనాలు రైతు భరోసా కేంద్రంలో 50 శాతం రాయితీపై ఇస్తున్నట్లు తెలిపారు. పొగాకు బేళ్లలో పేపర్లు లేకుండా వేలం కేంద్రానికి తీసుకురావాలన్నారు. పచ్చిరొట్ట ఎరువులు వేయడం వల్ల పొలంలో సేంద్రియ కర్బనం పెరుగుతుందని, నేల భౌతిక లక్షణాలు నీటి నిలుపుదల శక్తి పెరిగి వర్షం నీరు లోపలికి ఇంకుతుందని వివరించారు.

నేడు పర్యావరణ ప్రజాభిప్రాయ వేదిక

ఉలవపాడు: మండల పరిధిలోని ఉలవపాడు పంచాయతీలోని జాతీయ రహదారి పక్కన మెస్సర్స్ డీఆర్ ఆగ్రోఫామ్స్ ఎల్ఎల్‌పీ కంపెనీ సింగిల్ సూపర్ ఫాస్పేట్ యూనిట్‌ను స్థాపించాలని నిర్ణయించారు. దీనికి సంబంధించి నేడు ఉదయం 11 గంటలకు హైవే పక్కన కంపెనీ నిర్మాణ ప్రాంతంలో పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతుందని తహసీల్దార్ చంద్రారెడ్డి తెలిపారు. ప్రజలు హాజరుకావాలని కోరారు.

మామిడి మార్కెట్ కళకళ



పండు మార్కెట్‌లో ట్రేలో అమ్మకానికి ఉన్న కాయలు



కొనుగోలుదారులతో కళకళలాడుతున్న మార్కెట్

● ట్రే రూ. 600 నుంచి రూ.1000

ఉలవపాడు: మామిడి కాయల పండు మార్కెట్ కళకళలాడుతోంది. మండల కేంద్రమైన ఉలవపాడులో ఎంపీడీఓ కార్యాలయం నుంచి ఉత్తర బైపాస్ వరకు పండు కాయల మార్కెట్ సందడిగా మారింది. సీజన్ చివరి దశకు రావడంతో పండు కాయలు తోటల్లో పుష్కలంగా వచ్చాయి. ఉలవపాడు పరిసర ప్రాంతంలోని మామిడి రైతులు, వ్యాపారులు ట్రేలు, గంపలు, ఆటోలు, ట్రాక్టర్లలో ఇక్కడకు మామిడి కాయలను తీసుకొస్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి కొనుగోలుదారులు వచ్చి ఈ కాయలను కొనుక్కుంటారు. ఒక్కో ట్రేలో సుమారు 20 నుంచి 30 కాయల వరకు ఉంటాయి. ప్రస్తుతం బంగినపల్లె రకానికి చెందిన మామిడి కాయల ట్రే సుమారు 600 నుంచి 1000 రూపాయల వరకు అమ్ముతున్నారు. పండుగా ఉండి కాస్త మచ్చ ఉన్న కాయలు 600 రూపాయలు, నాణ్యతగా ఉన్న కాయలు 1000 రూపాయల వరకు అమ్ముతున్నారు. ప్రస్తుతం కాయలు పూర్తి స్థాయిలో అయిపోయాయి. దీంతో కొన్ని తోటల్లోనే కాయలున్నాయి. ఇంకో వారం రోజుల్లో మార్కెట్‌లో కూడా కాయలు అయిపోతాయని వ్యాపారులు చెబుతున్నారు. ఈ ఏడాది కాపు తక్కువగా రావడంతో కాయల రేట్లు అధికంగా ఉన్నాయి. కేవలం 45 శాతం పూత మాత్రమే వచ్చింది. ఈ ఏడాది కాయలు కాసిన రైతులు మంచి లాభాల బాట పట్టారు.

పొగాకు సరాసరి ధర రూ.282.87



టంగుటూరులో వేలం నిర్వహిస్తున్న శ్రీనివాసరావు

కొండపి(సింగరాయకొండ): కొండపి వేలం కేంద్రంలో శుక్రవారం పొగాకు సరాసరి ధర కేజీ రూ.282.87 పలికిందని నిర్వహణాధికారి జి.సునీల్ కుమార్ తెలిపారు. అక్కచెరువుపాలెం, గోగినేనివారి పాలెం, పైడిపాడు గ్రామాలకు చెందిన రైతులు 1,236 బేళ్లను వేలానికి తీసుకురాగా 1201 కొనుగోలయ్యాయి. వ్యాపారులు వివిధ కారణాలతో 35 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.330, కనిష్ట ధర రూ.205, సరాసరి ధర రూ.282.87, వేలంలో 25 మంది వ్యాపారులు పాల్గొన్నారు. అనంతరం రైతులకు పచ్చిరొట్ట పైర్ల సాగు, దానితో కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పొగాకు బోర్డు మెంబర్ బొడ్డపాటి బ్రహ్మయ్య, బోర్డు సిబ్బంది పాల్గొన్నారు.

997 పొగాకు బేళ్ల కొనుగోలు

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రం పరిధిలో శుక్రవారం నిర్వహించిన వేలంలో 997 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. చిరుకూరపాడు, పంగులూరివారిపాలెం గ్రామాలకు చెందిన రైతులు 1060 బేళ్లను వేలానికి తీసుకురాగా వాటిలో 63 బేళ్లను వ్యాపారులు తిరస్కరించారు. గరిష్ట ధర రూ.330, కనిష్ట ధర రూ.205, సరాసరి ధర రూ.266.51 పలికింది. వేలంలో మొత్తం 40 మంది వ్యాపారులు పాల్గొన్నారని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

లక్ష్య సాధనతో విద్యనభ్యసించాలి



విద్యార్థిని అభినందిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు

సీఎస్‌పురం (పామూరు): విద్యార్థులు లక్ష్య సాధనతో విద్యనభ్యసించాలని మండలంలోని చెన్నపునాయునిపల్లి ఎంపీయూపీ పాఠశాల హెచ్‌ఎం షేక్ యం.చాంద్‌బాషా అన్నారు. స్థానిక పాఠశాలలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో పాఠశాలలో 8వ తరగతి చదువుతూ ఇటీవల ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైన చింతలపూటి వెంకట చరణ్‌తేజను పాఠశాల హెచ్‌ఎం, మానవ హక్కుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ షేక్ గౌస్, ఉపాధ్యాయులు అభినందించారు. వారు మాట్లాడుతూ మండలంలో ప్రాథమికోన్నత పాఠశాల నుంచి ఎన్ఎంఎంఎస్‌కు విద్యార్థి ఎంపిక కావడం ఇదే ప్రథమమన్నారు. విద్యార్థులు చరణ్‌తేజను స్ఫూర్తిగా తీసుకుని వచ్చే ఏడాది మరికొందరు విద్యార్థులు స్కాలర్‌షిప్ సాధించాలన్నారు. ఉపాధ్యాయులు షరీఫ్, మధుబాబు, సిద్దయ్య, దుర్గాప్రసాద్, లక్ష్మి, నాగమల్లేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ఏపీటీఎఫ్ లక్ష్యం



సభ్యత్వ పత్రాలు అందజేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

పామూరు: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఏపీటీఎఫ్ పనిచేస్తోందని ఉపాధ్యాయులందరూ ఏపీటీఎఫ్‌లో చేరి సంఘం బలోపేతానికి సహకరించాలని సంఘం జిల్లా కార్యదర్శి షేక్ నాయబ్ రసూల్ అన్నారు. శుక్రవారం మండలంలోని బోడవాడ, అయ్యవారిపల్లి, కంబాలదిన్నె, బొట్లగూడూరు, కోడిగుంపల, లక్ష్మీనరసాపురం, ఇనిమెర్ల పలు పాఠశాలల్లో ఏపీటీ ఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ఏపీటీఎఫ్ ప్రథమ స్థానంలో ఉంటుందన్నారు. మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు పి.బాల ఆంజనేయులు, మచ్చా ప్రసాద్, మాల్యాద్రి, సత్యం పలువురు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో పిల్లల శాతం పెంచాలి



అంగన్ వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న చైర్మన్ గఫార్

కనిగిరి రూరల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం అందిస్తున్న పోషకాహార పథకాలపై ప్రజల్లో చైతన్యం పెంచి పిల్లల శాతాన్ని పెంచాలని మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక బొగ్గుల గొంది కాలనీలోని అంగన్ వాడీ కేంద్రాన్ని శుక్రవారం చైర్మన్ అబ్దుల్ గఫార్ పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ అంగన్ వాడీ కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. 0–5 ఏళ్ల లోపు చిన్నారులంతా అంగన్ వాడీ కేంద్రాల్లో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కౌన్సిలర్ రామనబోయిన శ్రీను, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

శివారు ప్రాంతాల అభివృద్ధిపై దృష్టి



వార్డుల్లో పర్యటిస్తున్న చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరి రూరల్: శివారు ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టి చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక ఒకటో వార్డులో సమస్య పరిష్కారంలో భాగంగా శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు నీరు, పారిశుద్ధ్యం, రోడ్లు, కాలువలు, విద్యుత్ దీపాలు తదితర సమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు. తక్షణ చర్యగా వార్డులో చిల్ల చెట్లను తొలగిస్తామని, డీప్ బోర్ వెల్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కౌన్సిలర్ రామనబోయిన ప్రశాంతి శ్రీనివాసులు, కుమారి, రమణమ్మ పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించండి



ఆస్పత్రిని తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే నరసింహారెడ్డి

కనిగిరి రూరల్: ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించి, వారి పట్ల సేవా గుణంతో వ్యవహరించాలని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిని శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఉగ్ర మాట్లాడుతూ వైద్యులు విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. తొలుత ఆస్పత్రిలోని అన్ని విభాగాలను పరిశీలించారు. సౌకర్యాలు సక్రమంగా లేక పోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అబ్దుల్ కలాం, టీడీపీ జిల్లా నాయకులు రాచమల్ల శ్రీనివాసులరెడ్డి, తమ్మినేని శ్రీనివాసులరెడ్డి, మాజీ వైస్ చైర్మన్‌లు వీవీఆర్ మనోహర్‌రావు, ఓబులరెడ్డి పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలంతా బడి బాట పట్టాలి



ఎస్టీ కాలనీలో బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది

సీఎస్‌పురం (పామూరు): బడిఈడు పిల్లలంతా బడిబాట పట్టాలని ఎస్టీకాలనీ ఎంపీపీ ఎస్ పాఠశాల హెచ్‌యం వెంకట్రామిరెడ్డి అన్నారు. మండల కేంద్రమైన సీఎస్‌పురం ఎస్టీ కాలనీ ఎంపీపీఎస్ పరిధిలో శుక్రవారం బడిబాట కార్యక్రమం ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్త నిర్వహించారు. ఈసందర్భంగా వారు ఎస్టీ కాలనీలోని నివాస గృహాల్లో ఇంటింటా తిరిగి 5 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరినీ పాఠశాలకు పంపాలని, 3 సంవత్సరాల వారిని అంగన్‌వాడీ కేంద్రానికి పంపాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. విద్యారంగానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధిక ప్రాధాన్యతనిచ్చి కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దాయన్నారు. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం నిర్వహిస్తున్నట్లు వారు పిల్లల తల్లిదండ్రులకు వివరించారు. 14 సంవత్సరాల్లోపు పిల్లలను పాఠశాలకు పంపకుండా పనికి పంపితే శిక్షార్హులవుతారని వారికి వివరించారు. ఉపాధ్యాయులు తోట శ్రీనివాసులు, పొట్టేండ్ల మాలకొండయ్య, అంగన్‌వాడీ కార్యకర్త మాధవి, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ బడిబాట ప్రారంభం



గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

కందుకూరు: పూర్వ ప్రాథమిక విద్య అందించే అంగన్‌వాడీ కేంద్రాల్లో అంగన్‌వాడీ బడిబాటను అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది ప్రారంభించారు. 6 సంవత్సరాల్లోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించే విధంగా కృషి చేస్తున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని దూబగుంట–1 అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో శుక్రవారం పలువురు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యతో పాటు, పిల్లల అన్ని విధాల వికాసం చెందడానికి అవసరమైన కార్యక్రమాలు చేపడతారని, అలాగే పౌష్టికాహారం పంపిణీ చేస్తామని వివరించారు. పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలంటూ గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉపాధ్యాయురాలు రాధ, అంగన్‌వాడీ కార్యకర్త నల్లపు మాధవి తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు తక్షణ నివేదికలు ఇవ్వండి



మాట్లాడుతున్న ఎంపీపీ దంతులూరి ప్రకాశం

కనిగిరి రూరల్: గ్రామాల్లో చేపట్టాల్సిన మౌలిక వసతుల కల్పనపై తక్షణ నివేదికలు తయారు చేసి ఇవ్వాలని ఎంపీపీ దంతులూరి ప్రకాశం అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఇంజినీరింగ్ సిబ్బంది, వెల్ఫేర్ సహాయ కులతో సమీక్ష సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ దంతులూరి ప్రకాశం మాట్లాడుతూ ప్రతి గ్రామంలో తాగు నీటి, విద్యుత్, రోడ్లు, కాలువలు, ఇతర సమస్యలను క్షేత్ర స్థాయిలో తిరిగి గుర్తించి నివేదికలను తయారు చేయాలన్నారు. తొలి ప్రాధాన్యతగా చేపట్టాల్సిన అన్ని పనులను గుర్తించి అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎంపీడీఓ మహేష్ బాబు, ఈఓపీఆర్‌డీ ఏ. అన్నమ్మ, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు ఎం. శ్రీకాంత్, ఎస్. తిరుపాలయ్య, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న తహసీల్దార్, ఎంపీడీఓ

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

వలేటివారిపాలెం: ప్రజా సమస్యల పరిష్కారానికి వలేటివారిపాలెం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజల నుంచి తహసీల్దార్ నాగమల్లేశ్వరావు, ఎంపీడీఓ రఫీక్ అహ్మద్ అర్జీలు స్వీకరించారు. ముందుగా వివిధ మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాల ప్రజల దగ్గరు నుంచి 17 అర్జీలు వచ్చినట్లు వీరు తెలిపారు. భూ సంబంధిత సమస్యలు పరిష్కారం కోసం 10 అర్జీలు, రేషన్ కార్డు కోసం 3 అర్జీలు, వృద్ధాప్య పింఛన్ కోసం రెండు అర్జీలు వచ్చినట్లు వీరు తెలిపారు. అలాగే కొండ సముద్రం గ్రామంలోని ఎస్సీ గ్రామానికి చెందిన ఇళ్ల మధ్య ఆక్రమణకు గురైన సీసీ రోడ్డు సమస్య పరిష్కరించాలని ఒక అర్జీ వచ్చినట్లు తెలిపారు. అదే కాలనీకి చెందిన గ్రంథాలయం వినియోగించుకొనేందుకు సరిగా లేదని దానిని శుభ్రపరచుటకు గ్రామస్తులు అర్జీ పెట్టుకున్నట్లు వీరు తెలిపారు. వచ్చిన అర్జీలను త్వరిత గతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి హేమంత్ భరత్‌కుమార్, ఎలక్ట్రికల్ ఏఈ మధుబాబు, పంచాయతీ రాజ్ ఏఈ గోపిచెంద్‌రెడ్డి, సీహెచ్ఓ శివరామయ్య పాల్గొన్నారు.

శాంతియుతంగా బక్రీద్ నిర్వహించుకోవాలి



ముస్లిం పెద్దలతో సమావేశమైన సీఐ రంగనాథ్

సింగరాయకొండ: ముస్లింల ప్రధాన పండుగైన బక్రీద్‌ను శాంతియుతంగా నిర్వహించుకోవాలని సీఐ దాచేపల్లి రంగనాథ్ సూచించారు. స్థానిక మండల కేంద్రంలోని పెద్ద మసీదులో శుక్రవారం ముస్లిం పెద్దలతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ.. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఈ సమావేశాలు నిర్వహిస్తున్నామని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముస్లింలు బక్రీద్ పండుగను నిర్వహించుకోవాలని చెప్పారు. బందోబస్తు విధుల్లో ఉన్న పోలీసులకు సహకరించాలని కోరారు. ఎస్సై టి.శ్రీరామ్, ఏఎస్సై షేక్ మహబూబ్‌బాషా, షేక్ మహబూబ్‌బేగ్, సయ్యద్ ఆబిద్‌అలీ, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా చేగువేరా జయంతి



చేగువేరా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

కందుకూరు: మేధావి, విప్లవకారుడు, గెరిల్లా పోరాట సిద్ధాంత రూపకర్త చేగువేరా 96వ జయంతిని పురస్కరించుకుని బుద్ధ అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రం, జాషువా సాహిత్య సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. చేగువేరా చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం పాలపిట్ట దీర్ఘకావ్య రచయిత ముప్పవరపు కిశోర్ మాట్లాడుతూ చెగువేరా విద్యార్థి దశలోనే లాటిన్ అమెరికా అంతా పర్యటించి పేదల కష్టాలు చూసి చలించిపోయారని తెలిపారు. పెట్టుబడిదారీ, దోపిడి, వలసవాదం, సామ్రాజ్యవాదాలకు వ్యతిరేకంగా పోరాటాలు చేశారని వివరించారు. అలాగే రచయితగా గొప్ప రచనలు చేశారని, ప్రధానంగా ది మోటార్ సైకిల్ డైరీస్, చేగువేరా టాక్స్ టు యంగ్ పీపుల్స్, చేగువేరా ఆన్ గ్లోబల్ జస్టిస్ వంటి గ్రంథాలను రచించారని చెప్పారు. ధమ్మ చక్ర ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఉపాసకులు గాండ్ల హరిప్రసాద్ మాట్లాడుతూ చేగువేరా చూపిన సామాజిక న్యాయ దృక్పథం నేడు ప్రపంచ వ్యాప్తంగా విస్తరించి బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఇది దిక్సూచిగా మారిందని తెలిపారు. సమసమాజ స్థాపనకు చేగువేరా స్ఫూర్తి ఎంతో ఉపయోగపడిందన్నారు. జాషువా సాహిత్య, సాంస్కృతిక సంస్థ కార్యదర్శి చనమాల కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రఖ్యాత టైమ్ మ్యాగజైన్ 20వ శతాబ్దపు 100 మంది అతి ప్రభావవంతమైన వ్యక్తుల్లో ఒకరిగా చేగువేరాను కీర్తించిందన్నారు. ఏ న్యూ సొసైటీ రిఫ్లెక్షన్స్ ఫర్ టుడేస్ వరల్డ్ పుస్తకంలో తన భావాలను విస్తృత పరిచే విధంగా, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పీడిత వర్గానికి సందేశం అందించారని వివరించారు. చేవూరు దుర్గా ప్రసాద్, ముతకాని లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి పెట్టాలి



కార్యదర్శుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

హనుమంతునిపాడు: గ్రామాల్లో తాగు నీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపీడీఓ కె.లలిత అన్నారు. శుక్రవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో తాగు నీటి సమస్యలున్న గ్రామాలను గుర్తించి సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. తాగు నీటి పథకాలకు వెంటనే మరమ్మతులు చేయించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు.

పండ్ల తోటల సాగు రైతులకు గుర్తించాలి

గ్రామాల్లో పండ్ల తోటల సాగుపై ఆసక్తి ఉన్న రైతులను గుర్తించి రైతుల జాబితాను తయారు చేయాలని వ్యవసాయ సహాయకులకు సూచించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ప్రభుత్వం పండ్లతోటల రైతులకు 3 సంవత్సరాలు పాటు పెంపకానికి నిధులు అందిస్తోందన్నారు. వ్యవసాయ సహాకులు రైతులకు రాయితీపై అందించే విత్తనాలు అర్హులైన రైతులకు సకాలంలో అందించాలన్నారు. రైతులకు సిబ్బంది అందుబాటులో ఉండాలని సూచించారు. వర్షాకాలం ప్రారంభం అవుతుంది. గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యే దృష్టి పెట్టాలన్నారు. పారిశుద్ధ్య నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ షేక్ షెరీఫ్, ఏపీఓ వెంకటేశ్వర్లు, ఏఓ గోపి క్రిష్ణ, సీనియర్ అసిస్టెంట్ మధుసూదన్ రెడ్డి, రఘురాం, కార్యదర్శులు పాల్గొన్నారు.